
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
మంగళవారం 13 ఫిబ్రవరి 2024

» ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఏర్పాటుపై నీలి నీడలు
» ప్రభుత్వం మారడంతో ప్రశ్నార్థకంగా మారిన వైనం
» కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

పురపాలిక కలేనా..?

ప్రతిపాదనలకే పరిమితం



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణం వ్యూ

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్న చందాన స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీని ఏర్పాటు చేయడానికి అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీ చేయడానికి అన్ని అర్హతలు, జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ ఉండడంతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారడం, ఘన్‌పూర్‌కు కోర్టు సైతం మంజూరు కావడంతో పాటు అతివేగంగా పట్టణీకరణ జరుగుతోంది. అయినా పురపాలకానికి ఘన్‌పూర్ నోచుకోకపోవడం విడ్డూరమని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. ఘన్‌పూర్ కంటే తక్కువ జనాభా, విస్తీర్ణం తక్కువ ఉన్న మండల కేంద్రాలను గత ప్రభుత్వం ఘన్‌పూర్‌ను మాత్రం విస్మరించింది. గత ప్రభుత్వంలో ఇక్కడి నుంచి ఇద్దరు ఉపముఖ్య మంత్రులుగా పనిచేసి పురపాలకంగా మార్చలేకపోయారనే విమర్శలు నేటికి వినిపిస్తున్నాయి. 2018 ఎన్నికల ముందు నుంచి ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేయాలనే ప్రధాన డిమాండ్ ఉన్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 71 కొత్త మున్సిపాలిటీలను ప్రకటించినప్పటికీ ఘన్‌పూర్‌ను పక్కన పెట్టింది. తదనంతరం ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో అసెంబ్లీ సమావేశాల్లో అప్పటి ఎమ్మెల్యే రాజయ్య మున్సిపాలిటీగా ఘన్‌పూర్‌ను ప్రకటించాలని కోరడంతో పాటు మంత్రివర్గం పరిశీలిస్తామని ప్రకటించడంతో అందరు సంతోషపడ్డారు. కాని అది కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది ఫిబ్రవరి 27న హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని సోడాషాపల్లి గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ సభలో అప్పటి మంత్రి కేటీఆర్ ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీ చేస్తామని, ప్రతిపాదనలు పంపాలని ప్రకటించారు.

తదనంతరం ఛాగల్, శివునిపల్లి, ఘన్‌పూర్ గ్రామాలను కలుపుకొని మున్సిపాలిటీ చేసేలా సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 2013 అసెంబ్లీ ఎన్నికలలోపే ప్రకటిస్తారని ఎదురుచూసినప్పటికి ప్రకటించలేదు. ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే ఘన్‌పూర్‌ను పురపాలకంగా మార్చుతామని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో మున్సిపాలిటీ ప్రకటన మరలా మొదటికి వచ్చింది. ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి కడియం గెలువడం రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ పురపాలకం ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఘన్‌పూర్‌ను పురపాలకంగా మార్చుతుందో వేచి చూడాల్సిందే.

ఎందుకింత నిర్లక్ష్యం..

స్టేషన్‌ఘన్‌పూర్‌ను డివిజన్ కేంద్రంగా మార్చినప్పుడు పురపాలకంగా ఎందుకు మార్చలేదనే అంశం ఇప్పటికీ ప్రజల్లో ప్రధాన చర్చగా, హాట్ టాపిక్‌గానే మిగిలింది..అనేక సందర్భాల్లో ప్రజలు చర్చించుకుంటునే ఉన్నారు. తమ కంటే తక్కువ జనాభా ఉన్న వాటిని పురపాలకాలు చేసినప్పుడు ఘన్‌పూర్‌ను ఎందుకు చేయరు అనే ప్రశ్నలు ఘన్‌పూర్ ప్రజల్లో నేటికి వినిపిస్తున్నాయి.

15వేల జనాభా దాటిన మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడమే కాకుండా అవసరమనుకుంటే సమీపంలోని గ్రామ పంచాయతీలను కలిపి ప్రకటించాలని నిర్ణయం తీసుకొని ప్రకటించారని తీర స్టేషన్‌కు మొండి చేయి చూపారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంట పట్టణాలను కలిపి పురపాలకంగా చేస్తారని చూసినప్పటికీ చేయకపోవడం ప్రజలను తీవ్ర మనస్తాపానికి లోను చేసిందని నేటికి ఇరు పట్టణాల ప్రజలు వివరిస్తున్నారు.

2011 జనాభా లెక్కలను అనుసరించి స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రం పట్టణ జనాభా 12,271 ఉండగా, శివునిపల్లి పట్టణ జనాభా 6,242, ఈ రెండింటి జనాభా కలిపితే మొత్తం 18,963 జనాభా ఉండడంతో అందరు మున్సిపాలిటీ అవుతుందని అనుకున్నారు. ప్రస్తుతం ఘన్‌పూర్ పట్టణ జనాభా సుమారు 20 వేల వరకు చేరుకోగా, శివునిపల్లి పట్టణ జనాభ సుమారు 10వేల వరకు చేరుకుంది. ఘన్‌పూర్ పట్టణ పరిధిలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం, రైల్వే స్టేషన్, బస్టాండ్, సమృద్ధిగా తాగునీరు విస్తృతమైన పట్టణీకరణ జరుగుతుంది. ఇన్ని రకాల క్వాలిటీస్ ఉన్న ఘన్‌పూర్‌ను ఇప్పటికైనా నేతలు ముందుకు వచ్చి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పురపాలక సంఘంగా ఏర్పాటు జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే అదనపు నిధులతో ఘన్‌పూర్ రెట్టింపు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.. మున్సిపల్ అయితే పట్టణీ కరణ జరగడమే కాకుండా నిధులు భారీగా వచ్చే అవకాశం ఉంటుంది. తద్వార ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పన జరుగడమే కాకుండా పట్టణం సుందరీకరణ చెందుతుందని మేధా వులు వారి అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే ఘన్‌పూర్ పురపాలకం కావల్సిందేనని ప్రజలు కోరుతున్నారు.



స్టేషన్ ఘన్‌పూర్‌లోని నేషనల్ రహదారి

అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ శివలింగయ్య



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, ఫిబ్రవరి 12: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. వాటిని సంబంధిత శాఖ అధికారులకు రెఫర్ చేశారు. వివిధ శాఖలకు సంబంధించి 60 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు. తమ పక్క భూమిలో నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మిస్తున్నారని, నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతూ జనగామ మండల లంలోని చీటకోడూరు గ్రామానికి చెందిన కె.మోహన్‌రెడ్డి అర్జీ పెట్టుకున్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలో జరుగు శ్రీసమ్మక్క సారలమ్మ జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కళాకారుల సంఘం వారు విజ్ఞప్తి చేశారు. తనకు తెలియకుండా తన భూమిలో బోరు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఉప్పుగల్ గ్రామానికి చెందిన గుంటి రాజమ్మ ఫిర్యాదు చేశారు. 20 ఏళ్ల క్రితం యాక్సిడెంట్‌లో కాళ్లు కోల్పోయిన తనకు దివ్యాంగుల పింఛన్ ఇవ్వాలని కోరుతూ లింగాలఘణపురం మండలం వడిచర్ల గ్రామానికి చెందిన జక్కు రవీందర్ అర్జీ ఇచ్చారు. తన పట్టా భూమిని తనకు తెలియకుండా ఇతరులకు మార్పిడీ చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన దేశగాని సోమయ్య కోరారు. లింగాలఘణపురం మండలంలో నెల్లుట్ల గ్రామంలో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుషా పులను తొలగించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. కొడకండ్ల బాయ్స్ హాస్టల్, స్టేషన్‌ఘన్‌పూర్ బాలికల హాస్టల్‌లో ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ కింద పనిచేస్తున్న వారికి 14 నెలల నుంచి జీతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా బిల్లులు వచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో రామ్మూర్తి, డీఆర్‌డీవో మొగులప్ప, జడ్పీసీఈవో అనిల్‌కుమార్, డీఈవో రాము, డీఏవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

92 శాతం విద్యార్థుల హాజరు



ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఐఈఓ

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12: ఇంటర్ ప్రాక్టికల్స్ మూడో విడత పరీక్షలు కొనసాగుతున్నాయి. ఉదయం సెషన్ లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులతో కలిపి 837 మంది కి గాను 762 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్ లో 530 మంది విద్యార్థులకు 497 మంది హాజరయ్యారు. మొత్తం 1367 మంది విద్యార్థులకు 1259 మంది హాజరుతో 92.09 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ భైరి శ్రీనివాస్ తెలిపారు. పరీక్షల సందర్భంగా జఫర్‌గఢ్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాల, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, జనగామ లోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఐఈఓ భైరి శ్రీనివాస్, డెక్ సభ్యులు కె.ఆంజనేయ రాజు తో కలిసి సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడ్వాయి, ఫిబ్రవరి 12: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మేడారం-తాడ్వాయి రహదారిలో సోమవారం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 25 ఏళ్లు ఉంటాయని, సిమెంటు కలర్ ఫుల్ షర్ట్, బ్లూ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ములుగులోని ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670087, 8712670088 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

సఖీ జిల్లా కో ఆర్డినేటర్ ఒద్దిరాల జ్యోతి

వివరాలు 8లో

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో బదిలీ

- నూతన పీవోగా చిత్రామిశ్రా



అంకిత్



చిత్రామిశ్రా

ములుగు, ఫిబ్రవరి 12: ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ బదిలీ అయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చిత్రామిశ్రాను నియమించింది. వీరిద్దరూ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ సమర్థవంత అధికారిగా మన్ననలు పొందారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో కృషి చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మేడారం మహాజాతర కోసం ఐటీడీఏ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చాలా వరకు పనులను ఇప్పటికే పూర్తిచేయించారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

డోర్నకల్, ఫిబ్రవరి 12: రోలింగ్ కారిడార్ బ్లాక్ వల్ల గతంలో రైల్వే అధికారులు రద్దు చేసిన కాజీపేట-డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్-కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ రైలు, విజయవాడ-డోర్నకల్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-డోర్నకల్-విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పునరుద్ధరించిన రెండు ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 25వ తేదీ వరకు నడుస్తాయని తెలిపింది. సామాన్య ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడం పట్ల డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాషా హర్షం వ్యక్తం చేశారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

» వన్యప్రాణుల కోసం తీగలు అమర్చిన వేటగాళ్లు
» విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి
» భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం



రమేష్ (ఫైల్)



ప్రవీణ్(ఫైల్)

7లో

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో 23మంది ఇతర ప్రాంతాలకు..

వివరాలు 7వ పేజీలో...

నేడు మేడిగడ్డకు సీఎం

» బ్యారేజీ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు
» పార్కింగ్ ప్రదేశాలతోపాటు సభాస్థలి నిర్మాణం
» గోదావరిలో కుంగిన పిల్లరు వద్ద డీవాటరింగ్



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సభావేదిక నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులు



మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 12: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వస్తున్నారు. మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఈ బృందం రానుంది. ఈ పర్యటనపై సీఎం ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సుమారు 40 బస్సుల్లో మేడిగడ్డకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ సందర్శన అనంతరం సమీపంలోని హోమశాల వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలను వివరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

ఇందుకు అధికారులు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీ పార్కింగ్, విడిది ప్రదేశాలను ఇప్పటికే సిద్ధం చేశారు. అలాగే బ్యారేజీ వంతెనపై కుంగిన పిల్లరు మీదుగా మహారాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలో పగుళ్లు తేలిన పిల్లర్ల వద్దకు రేవంత్‌రెడ్డి బృందం వెళ్లనుండగా అక్కడ సైతం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా బ్లాక్-7లోని 20వ పిల్లరును ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశం ఉండటంతో ఆ ప్రదేశంలో ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ చేస్తున్నారు. కుంగిన ప్రాంతంలో కాంక్రీటు పగుళ్లు తేలడంతో గోదావరి ప్రవాహాన్ని మరల్చేందుకు ఏర్పాటు చేసి మట్టి కట్టల ద్వారా ఊటలు ఉబికివస్తున్నాయి. దీంతో పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి వచ్చే మార్గాల్లో సైతం స్వల్ప మార్పులు చేశారు. బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం మీదుగా మేడిగడ్డకు ముఖ్యమంత్రి బృందం చేరుకుంటుందని రూట్‌మ్యాప్ సిద్ధం చేయగా సోమవారం దానిని మార్చేశారు. కుదురుపల్లి వద్ద నుంచి మహదేవపూర్ మండల కేంద్రం, ఎల్అండ్‌టీ రోడ్డు మీదుగా నేరుగా మేడిగడ్డ బ్యారేజీకి ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరుకోనున్నారు. తిరిగి అదేమార్గంలో హైదరాబాద్‌కు వెళ్లిపోనున్నారు. మహదేవపూర్ నుంచి వెళ్లే మార్గంలో సుమారు ఐదు గ్రామాలు ఉండటంతో ట్రాఫిక్‌పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో రూట్‌ను మార్చినట్లు సమాచారం.

బస్సులో వచ్చి.. హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు..

హైదరాబాద్ నుంచి ఏసీ బస్సుల్లో ఉదయం 9.30 గంటలకు బయల్దేరనున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధ్యాహ్నం 2 గంటలకు మేడిగడ్డకు చేరుకోన్నారు. బ్యారేజీ వద్ద పరిశీలన, సభ అనంతరం మంత్రులు, ఎమ్మెల్యే తిరిగి హైదరబాద్‌కు బస్సుల్లో బయల్దేరనున్నారు. ముఖ్యమంత్రి మాత్రం మేడిగడ్డ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా హైదరబాద్‌కు తిరిగి వెళ్లనున్నినరు.

పర్యటన ఇలా..

- ఉదయం 9.30 గంటలకు రోడ్డు మార్గాన హైదరబాద్ నుంచి మేడిగడ్డకు బయల్దేరుతారు.
- మధ్యాహ్నం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటారు..
- 2 నుంచి 3గంటల వరకు బ్యారేజీ వంతెన, కుంగిన పిల్లర్లను ఎరిశీలించనున్నారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశమై సమీక్షించనున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితి, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మీడియాతో సీఎం మాట్లాడతారు.
- సాయంత్రం 5గంటలకు తిరిగి హైదరబాద్‌కు వెళ్తారు.

కృష్ణా జలాలు అప్పగించడం నీచమైన చర్య

-మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 12 : కేంద్రం ఆధీనంలోకి కృష్ణాజలాలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం నీయమైన చర్య అని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవరుప్పుల మండ లంలోని సీతారాంపురంలో దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లనుంచి కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా కూడా మాజీ సీఎం కేసీఆర్ తలవంచక తాకట్టుపెట్టలేదన్నారు. నెలరోజుల పరిపాలన లోనే కేంద్రానికి భయపడి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృష్ణా జలాలను తాకట్టుపెట్టడం జరిగింద న్నారు. అది విరమించుకునేదాక ధర్నాలు, నిరసనలు తెలుపుతూనే ఉంటామని తెలిపారు. ఆరోజుల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో, మహారాష్ట్రలో కేంద్రంలో అధికారంలో ఉండి అక్రమంగా ఆనకట్టలు కట్టడం వల్ల ఎస్సారెస్పీ జలాలను చుక్కనీరు రానివ్వలేదన్నారు. అప్పుడు పరిపాలనలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు నీరు మెదపలేదన్నారు. కేసీఆర్ చొరవ చూపడం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం వల్లే ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీరు వచ్చిందన్నారు. దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం టీడీపీ హయాంలో ప్రారంభిస్తే పదేళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టక పోవటంతో మహానుభావుడు కేసీఆర్ పూర్తి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సాగునీరు కేసీఆర్ ఈరోజు అద్భుతంగా అందించారని, ఇంటింటికీ తాగునీరు అందించారని, ప్రతీ చెరువుకు కేసీఆర్ దయవలనే నీరు వచ్చిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కావాలని కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులు కట్టడంపై చుక్కనీరు రాలేదని ఆరోపిస్తున్నారన్నారు. చుక్కనీరు రాకుంటే వర ంగల్ జిల్లాకు నీరు ఎలా వచ్చిందో తెలుపాలన్నారు. కాళేశ్వరం కొంత కుంగిపోతే కేసీఆర్‌పై పూర్తిగా అబాండం వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ వారు తెలంగాణకు ఏమి చేశారో తెలుపాలని తాను ప్రశ్నిస్తున్నానన్నారు. గత పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు, తాగు, సాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అవి ఇప్పుడు గుర్తుకు చేసుకుంటున్నారన్నారు. 13న నల్లగొండలో జరిగే కేసీఆర్ సభకు అధిక సంఖ్యలో రైతులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, నాయకులు బస్వ మల్లేశం, కొల్లూ రు సోమయ్య, హన్మంతు, చింత రవి, బస్వ వెంకన్న, యాదగిరి, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాక్షి కాలనీకి చెందిన బొంత వెంకటేశ్వర్లు, అతడి భార్య, కొడుకు రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. వారు ఇంటి సమస్యలపై గొడవ పడుతుండగా ఇంటి పక్కనే ఉన్న రాజు, ప్రకాశ్, నాగరాజు, ఉమ, రమ, సమ్మక్క అనే ఆరుగురు వ్యక్తులు కలుగ జేసుకుని ఇంటిపైకి వచ్చారు. వెంకటేశ్వర్లు కుమారుడు రాజుపై ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి దిగారు. దీనిపై వెంకటేశ్వర్లు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఐనవోలు, ఫిబ్రవరి 12: గడ్డిమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం రాంచంద్రపురం గ్రామానికి చెందిన దౌతుబాజి అజయ్(22) ఇంటర్ చదివాడు. అమ్మమ్మ గ్రామమైన వెంకటాపురంలో నివసిస్తున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో అజయ్ వారం కిందట గడ్డి నివారణ మందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

రూ. 8 లక్షలు కాజేసిన కారుడ్రైవర్... కేసు నమోదు చేసిన పోలీసులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ జిల్లా నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఆమె కారు డ్రైవర్ డబ్బులు తీసుకుని మోసం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురలో ఉంటున్న ఓ మహిళ.. నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో భర్తతో విడాకులు తీసుకుంది. హనుమకొండలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటోంది. కాగా, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన బూజుగుండ్ల శివరాజ్ అనే వక్తి రెడ్డికాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మహిళా ఉద్యోగితో ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. తాను కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని నమ్మబలికాడు. ఈ మేరకు 2019లో మహిళా ఉద్యోగి ఒక కారు కొనుగోలు చేసి తాత్కాలిక డ్రైవర్‌గా శివరాజ్‌ను నియమించుకుంది. చాలాసార్లు ఆమె పిల్లల వద్దకు హైదరాబాద్‌కు తనతో తీసుకుని వెళ్లి వచ్చారు. ఆమె వద్దనే పర్మినెంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెకు తన కుటుంబసభ్యులను సైతం పరిచయం చేశాడు.

కాగా, డబ్బులు అవసరం ఉన్నాయని మహిళ నుంచి రూ.8లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఆమె సెల్‌ఫోన్ నుంచి పర్సనల్ ఫొటోలు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. డబ్బులు అడిగితే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని ఫోన్ చేసి బెదిరించేవాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోపాటు కారును కూడా ఇవ్వలేదు. ఇదేమిటని అడుగగా డబ్బులు, కారు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.


వేయిస్తంభాలగుడి కల్యాణ మండపానికి తుది మెరుగులు


పూర్తయిన మండపం పైకప్పు

'కల్యాణ' వైభోగమే..

● పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ● ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన కాకతీయుల కాలం నాటి శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మండపం పైకప్పు పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఈనెల 18వ తేదీన కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ముహూర్తం నిర్ణయించారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి మండప ప్రారంత్సోవాన్ని మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించాలని మొదట నిర్ణయించారు. అయితే ఆలోగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీనితో ఈ లోగానే మండపం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మండపం పనులను పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు.

పూర్తయిన పైకప్పు

కల్యాణ మండపంపైన పైకప్పు పూర్తయింది. పలకలన్నిటినీ అమర్చారు. దక్షిణ ద్వారం వైపు మూడు పకలను అమర్చాల్సి ఉన్నది. వాటిని బుధ, గురువారాల్లో అమర్చితే మండపం పునర్నిర్మాణం పనులు పూర్తయినట్టే. మండపం పనుల త్వరితగతిన పూర్తికి స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ నేతృత్వంలో తమిళనాడుకు చెందిన సుమారు 40మంది శిల్పులు రేయింబవళ్లు పని చేశారు. విద్యుత్‌లైట్ల వెలుగుల్లో అర్థరాత్రి వరకు పనులు కొనసాగించారు. కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ ఎస్. సుమితా కుమారి పర్యవేక్షణలో పురావస్తు ఇంజనీర్ క్రిష్ణచైతన్య. జిల్లా పురవాస్తుశాఖ అధికారి మల్లేశం దగ్గరుండి పనులు చేయించారు. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు సాంకేతిక సహాయాన్ని అందించారు.

ప్రమాదాన్ని పసిగట్టి

వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దీనికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరుకున్నది. ఇందుకు కారణం దానికి కింది నుంచి ప్రవహించిన నీటి పాయగా గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో వాడిన ఇసుక తొలగిపోవడం వల్ల ఈశాన్య దిశగా రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగి పోవడం మొదలుపెట్టింది. దీనిని అలాగే ఒదిలేస్తే మండపం ఎప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించింది. ఒకవేళ అదే జరిగితే స్తంభాలన్నీ ముక్కలుగా విరిగి పోయి పునర్‌నిర్మాణం ఏమాత్రం సాధ్యం కాదు. దీంతో మండపం పడిపోక ముందే కేంద్ర పురావస్తు శాఖ 18 ఏళ్ల కిందట దీని పునర్నిర్మాణమనే మహాఘట్టానికి శ్రీకారం చుట్టింది. దిగితేకానీ లోతు తెలియదన్నట్లుగా పునర్నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి.

ఆగుతూ సాగుతూ..

మండపం పునర్నిర్మాణ పనులు ఇన్నాళ్లు అనేక అడ్డంకుల మధ్య ఆగుతూ సాగుతూ వచ్చాయి. మండపం పునర్మిణ పనులు 2006లో మొదలయ్యాయి. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు చొరవతో ఒకవైపు కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న మండపాన్ని మొదట ఎక్కడికక్కడ పూర్తిగా విప్పారు. వాటికి నెంబర్లు వేసి పద్మాక్షి గుడి సమీపంలో జాగ్రత్తగా భద్రపరిచారు. ఇసుక పునాదిని పూర్తి తొలగించి ఆ స్థానంలో మరో వెయ్యేళ్లపాటు కట్టడం నిలిచి ఉండేలా తిరిగి అదే రీతిలో ఇసుకతో (సాండ్ బాక్స్ టెక్నాలజీ) పునాదిని నిర్మించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత 2010లో మండపాన్ని తిరిగి నిలబెట్టే పనులు మొదలయ్యాయి. 2017వరకు పనులు సజావుగానే సాగాయి. ఆ తర్వాత స్థపతికి బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యం వల్ల పనులు కుంటుపడ్డాయి. దాదాపు ఐదేళ్లపాటు అసలు పనులే జరగలేదు.

కేంద్రమంత్రి చొరవతో..

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండపం పనుల్లో కదలిక వచ్చింది. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు వరంగల్‌కు వచ్చిన పలు సందర్భాల్లో ఈ మండపం పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులు సత్వరం పూర్తయ్యేట్టు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండపం పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. స్థపతికి చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఏర్పడిన సమస్యను ఆయన పరిష్కరించారు. బిల్లుల చెల్లింపు జరిగేట్టు చూడడమే కాకుండా చివరి దశ పనుల పూర్తికి అవసరమైన రూ.5 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. అలాగే మండపం మిగిలిపోయిన పనులను చిన్న చిన్న బిట్లుగా చేసి ఒక్కోదానికి ఇంత అని నిర్ణయించి నిధులు విడుదల చేయడం ద్వారా పూర్తి చేసేందుకు కేంద్ర పురావస్తుశాఖ ముందుకు వచ్చింది. ఆ మేరకు ఏడాది కిందట పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఐదు బిట్లకు నిధులు విడుదలయ్యాయి. దీనితో పనులు వేగం పుంజుకున్నాయి. కాగా, జనవరి నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తిచేయాలని, మార్చి నాటికి ప్రారంభోత్సవానికి మండపాన్ని సిద్ధంగా ఉంచాలని కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రంగంలోకి దిగి పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా ప్రత్యక్ష పర్యవేక్షణ జరిపారు. ఎట్టకేలకు పనులు పూర్తయి మండపం పూర్వరూపాన్ని సంతరించుకున్నది.

నేడు కిషన్‌రెడ్డి రాక

పూర్తయిన వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు. మధ్యాహ్నం 1గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్ విష్ణుప్రియ గార్డెన్స్‌కు ఎదురుగా బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఇక్కడ మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 3గంటలకు వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని సందర్శించారు. పనుల పరిస్థితిని పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖిలా వరంగల్ కోటను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో 23మంది ఇతర ప్రాంతాలకు..

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను 105 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 23 అధికారులు స్థానచలనం చెందారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం ఎంపీడీవోలను బదిలీ చేసిన పంచాయతీరాజ్ కమిషనర్.. సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను బదిలీ చేశారు.

బదిలీలు ఇలా..

ఎం.విద్యాలత సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడె జిల్లా నుంచి సీఈవో జడ్పీ హనుమకొండకు బదిలీపై వస్తున్నారు. ఎస్.వెంకటేశ్వర్‌రావు సీఈవో జడ్పీ హనుమకొండ నుంచి సీఈవో జడ్పీ ములుగు బదిలీ. ఎస్.ప్రసూనారాణి సీఈవో జడ్పీ ములుగు నుంచి సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడెం బదిలీ. ఎ.శ్రీనివాస్‌కుమార్ డీఆర్‌డీవో హనుమకొండ నుంచి డీఆర్‌డీవో ములుగు బదిలీ. పి.నరేష్ డిప్యూటీ సీఈవో జగిత్యాల నుంచి డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీపై వస్తున్నారు. డి.పురుషోత్తం డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి నుంచి డీఆర్‌డీవో మహబూబాబాద్ బదిలీ. ఆర్.సన్యాషయ్య డీఆర్‌డీవో మహబూబాబాద్ నుంచి డీఆర్‌డీవో ఖమ్మం బదిలీ. కె.నాగపద్మజ డీఆర్‌డీవో ములుగు నుంచి డీఆర్‌డీవో హనుమకొండకు బదిలీ. ఎం.సంపత్‌రావు డీఆర్‌డీవో వరంగల్ నుంచి డీఆర్‌డీవో జగిత్యాల బదిలీ. ఎన్.వసంత డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వికారాబాద్ బదిలీ. టి.పవన్‌కుమార్ డిప్యూటీ సీఈవో జడ్పీ కరీంగనర్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ బదిలీపై వస్తున్నారు.

డి.సరిత డిప్యూటీ సీఈవో జడ్పీ మేడ్చల్ మల్కాజిగిరి నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామకు బదిలీపై వస్తున్నారు. బిసాహితి మిత్ర డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జయశంకర్ భూపాలపల్లి బదిలీ. ఎస్.వెంకట్ అడిషన్ పీడీ పశుసంవర్ధక శాఖ మహబూబాబాద్ నుంచి మాతృసంస్థ వ్యవసాయ శాఖకు బదిలీ అయ్యారు. పి.బాలక్రిష్ణ అడిషినల్ డీఆర్‌డీవో ములుగు నుంచి అడిషినల్ డీఆర్‌డీవో సిద్దిపేటకు బదిలీ. జె.కౌసల్యాదేవి అడిషనల్ డీఆర్‌డీవో సిద్ధిపేట నుంచి డీఆర్‌డీవో వరంగల్ బదిలీపై వస్తున్నారు. ఆర్.స్టీఫెన్‌నీల్ అడిషినల్ డీఆర్‌డీవో వికారాబాద్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో ములుగు బదిలీపై వస్తున్నారు. ఎస్.వసుమతి అడిషినల్ డీఆర్‌డీవో వరంగల్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీ. లక్కినేని లక్ష్మీరమాకాంత్ డీపీవో భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీపీవో హనుమకొండ బదిలీపై వస్తున్నారు. వి.జగదీశ్వర్ డీపీవో హనుమకొండ నుంచి డీపీవో ములుగు బదిలీ. లత డీపీవో జయశంకర్ భూపాల్‌పల్లి నుంచి డీపీవో పెద్దపల్లి బదిలీ. కొండ వెంకయ్య డీపీవో ములుగు నుంచి డీపీవో మేడ్చల్ మల్కాజిగిరి బదిలీ. వి.నారాయణ రావు డీపీవో జయశంకర్ భూపాలపల్లి.

భారీగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ అర్బన్ జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనరేట్ ఇ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరుపుతున్నట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 3 ఎక్సైజ్ స్టేషన్లను కలుపుకుని 13 మందికి బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ స్టేషన్‌లతోపాటు ఐఎంఎల్ లిక్కర్ డిపోలు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ విభాగాల్లో ఎక్కువకాలం పని చేసిన వారికి బదిలీలు జరిగినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
జి. దుర్గాభవాని	హుజురాబాద్	హనుమకొండ
ఎస్. ప్రభాకర్‌రెడ్డి	జగిత్యాల	వరంగల్ అర్బన్
కె. రాజు	ఖమ్మం-1	ఖిలావరంగల్
సీహెచ్‌ఎస్.ఆనంద్‌రావు	సుల్తానాబాద్	డీటీఎఫ్ వరంగల్ అర్బన్
ఎం. తిరుమలత	కరీంనగర్ రూరల్	ఐఎంఎల్ డిపో హనుమకొండ
సీహెచ్ నాగేశ్వర్‌రావు	డీటీఎఫ్ కొత్తగూడెం	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
కె. నాగయ్య	అశ్వరావుపేట	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
సీహెచ్ నీరజ	డీటీఎఫ్ వరంగల్ అర్బన్	డీటీఎఫ్ మహబూబాబాద్
బి. చంద్రమోహన్	ఖిలావరంగల్	ఖమ్మం -2
బి. కరుణశ్రీ	ఐఎంఎల్ డిపో హనుమకొండ	డీటీఎఫ్ ఖమ్మం
టి. శ్రీనివాసులు	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	హుజురాబాద్
ఎం. మాధవిలత	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	జమ్మికుంట
ఎల్. రామకృష్ణ	హనుమకొండ	చెక్‌పోస్టు నిజామాబాద్


సద్దిమడుగులోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

మేడారానికి లక్నవరం నీటి విడుదల

సద్దిమడుగులోకి మొదలైన ప్రవాహం

రెండు రోజుల్లో జంపన్నవాగులోకి మళ్లింపు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకోసం మండలంలోని ప్రఖ్యాత లక్నవరం సరస్సు నుంచి జలాలను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈఈ శ్రీనివాస ఆధ్వర్యంలో సిబ్బంది తూములను ఎత్తారు. తొలుత నీటిని సమీపంలోని సద్దిమడులోకి తరలిస్తున్నారు. రెండు రోజుల తర్వాత దయ్యాలవాగు మీదుగా జంపన్నవాగులోకి ప్రవాహాన్ని మళ్లిస్తామని ఈఈ తెలిపారు. ప్రస్తుతం జంపన్న వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో భక్తులు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కిందనే పుణ్యస్నానాలు చేస్తున్నారు. పుణ్య జంపన్న వాగు నీటిలో తలారా స్నానం చేయడాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులు ప్రవాహం లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. మహాజాతరకు ఎనిమిది రోజుల గడువు మాత్రమే ఉండగా ఇప్పటికే నిత్యం లక్షలాది మంది వనదేవతల దర్శనానికి తరలివస్తున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎనిమిది రోజుల ముందుగానే లక్నవరం నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు.

మేడారంలో కొనసాగుతున్న మొక్కులు

ముందస్తుగా దర్శించుకున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 12: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు జోరుగా కొనసాగుతున్నాయి. మహాజాతరకు ముందుగానే తరలివస్తున్న భక్తులు తల్లుల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి యాట మొక్కులు చెల్లిస్తున్నారు. సోమవారం సుమారు 50 వేల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయశాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తు పూనకాల నడుమ వనదేవతలకు జేజేలు పలుకుతూ అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. తల్లులను తాకి వడిబియ్యం పోసి పసుపు కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.


మేడారంలో వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు తాగునీటి కష్టాలు

వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి సోమవారం మేడారం తరలివచ్చిన భక్తులకు తాగుగునీటి కష్టాలు తప్పలేదు. తీవ్రఎండలో క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్న సందర్భంలో దాహంతో అల్లాడాల్సి వచ్చింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. వారి అవస్థలు చూసే వారే అక్కడ కరువయ్యారు.

వెడేక్కి చల్లబడి..

మేడారం మహాజాతర సందర్భంగా పరిసరాల్లో వెలిసిన దుకాణాల్లో శీతల పానీయాలు అమ్ముతున్నారు. వివిధ కంపెనీల కూల్‌డ్రింక్స్ లభ్యమవుతున్నాయి. అయితే.. ఆయా కంపెనీల డీలర్లు స్టాకును ఎండలోనే ఉంచుతున్నారు. రెండు మూడు రోజులపాటు ఎండలో ఉన్న కూల్‌డ్రింక్స్‌ను ఫ్రిజుల్లో చల్లబరిచి భక్తులకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలను ఎండలో ఉండటం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు అంటున్నారు.


గద్దెల పరిసరాల్లో రద్దీ

గుడారాల మేడారం



మేడారం మహాజాతర సందర్భంగా ని చిరు వ్యాపారులు గుడారాలు వేసి దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర జరగనుండగా మొక్కులు చెల్లించుకునేందు కోటిన్నరకు పైగా భక్తులు మేడారం తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. దీంతో వ్యాపారాలు జోరందుకోనున్నాయి. అలాగే భక్తులకు ప్రభుత్వం సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. వారికి వేలాది మంది అధికారులు సేవలు అందించనున్నారు.

లోపించిన పారిశుధ్యం



మేడారంలో పారుశుద్యం లోపించింది. దీంతో అక్కడి పరిసరాలు దుర్వాస వెదజల్లుతున్నాయి. ఆదివారం 10 లక్షలకు పైగా భక్తులు రాగా వారి వదిలిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలు తొలగించలేక పోయారు. ఈ క్రమంలో సోమవారం గద్దెల పరిసర ప్రాంతాల్లో దుర్వాతస వెదజల్లింది. దీనిపై భక్తులు, స్థానికులు డీపీవో వెంకయ్యకు ఫిర్యాదు చేశారు.

సీఐల బదిలీల్లో గందరగోళం

పరకాల సీఐగా వెళ్లిన అబ్బయ్య వీఆర్‌కు అటాచ్

ఇప్పటికే కేయూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నియామకం నిలిపివేత

హనుమకొండ, ఫిబ్రవరి 12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. పోస్టింగ్ పొందిన కొందరు అధికారులు డ్యూటీలో జాయిన్ కాకుండానే వెనక్కి పంపిస్తున్నారు. సీఐల పోస్టింగ్ నేడు పోస్టింగ్.. రేపు ఊస్టింగ్.. అనే పరిస్థితిలో ఉంది. ప్రధానంగా గతంలో పనిచేసిన పోలీసుస్టేషన్‌లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు మాత్రమే పోస్టింగ్‌లలో ఈ మార్పు జరుగుతోందని, మిగతా వారికి ఇబ్బంది లేదని పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన బదిలీల్లో కేయూ నుంచి పరకాలకు పోస్టింగ్‌పై వెళ్లిన ఎం. అబ్బయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్టే ఇచ్చి ఆర్డర్‌ను రద్దు చేశారు. విధుల్లో చేరి రెండు రోజులు గడవక ముందే సీపీకి (వీఆర్) అటాచ్ చేయడం వివాదాస్పదంగా మారింది. పరకాలకు ఇంకా ఎవరిని నియమించలేదు. అదే విధంగా ఖమ్మం నుంచి కేయూ పీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చిన శ్రీధర్‌కు ఇచ్చినట్టే ఇచ్చి కొన్ని అనివార్య కారణాల వల్ల పోస్టింగ్ నిలిపి వేశారు. కేయూకు గతంలో ఏనుమాములలో పని చేసిన చేరాలును నియమించే అవకాశాలు ఉన్నాయి. అయితే పరకాలకు, కేయూకు ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌స్పెక్టర్లను సీపీ నియమించనున్నారు. అలాగే ఇటీవల ములుగు నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన మరో వివాదాస్పద ఇన్‌స్పెక్టర్‌ను కూడా వెనక్కి పంపించే అవకాశాలు మెండుగా ఉన్నాయనే పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

లూప్‌లైన్ లేకుండా పోస్టింగ్‌లు

ప్రస్తుతం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్‌లు పొందిన వారు లూప్‌లైన్‌లో పనిచేయకుండానే పోస్టింగ్ కొట్టేయడం కొందరు సీనియర్ అధికారులకు మింగుడుపడడం లేదు. ఒక పోలీసు అధికారి ఎస్‌ఐ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన తర్వాత కనీసం 3 యేళ్లపాటు లూప్‌లైన్‌లో పని చేసి ఉండాలి. కానీ ప్రజాప్రతినిధుల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నట్టు తెలుస్తోంది.

మేడారం జాతరకు ఉత్సవ కమిటీ

● ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం ● చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్


అర్రెం లచ్చుపటేల్

ములుగు, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన అర్రెం లచ్చుపటేల్ నియమితులయ్యారు. జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ సహా 14మంది సభ్యులతో కూడిన జాబితాను ఇటీవల రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దేవాదాయ శాఖకు సిఫారసు చేశారు. పరిశీలించిన అధికారులు అదే జాబితాతో కమిటీని ప్రకటించారు. ఈనెల 12నుంచి 25వ తేదీ వరకు కాలపరిమితితో పని చేసే ఈ ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్ వ్యవహరించనుండగా డైరెక్టర్‌లుగా మిలుకూరి అయిలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు వ్యవహరించనున్నారు.

ఈ నూతన ఉత్సవకమిటీ ఒకట్రెండు రోజుల్లో పదవీ ప్రమాణం చేసే అవకాశముంది. కాగా, తనను మేడారం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడంపై అర్రెం లచ్చుపటేల్ మంత్రులు సీతక్క, కొండా సురేఖలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను విజయవంతం చేస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

● విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి ● భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

కాటారం/గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను సంహరించేందుకు వేటగాళ్ల బిగించిన విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా విద్యుత్ ప్రసరణ జరిగే ఉచ్చు తగిలి గ్రేహౌండ్స్ జూనియర్ కమాండో బలయ్యాడు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెంలో తప్పిపోయిన గొర్రెలను వెతుకుతుండగా ఉచ్చు తగిలి ఓ వ్యక్తి మరణించాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కూంబింగ్ చేస్తుండగా..


ప్రవీణ్ మృతదేహం

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో కాటారం శివారు అటవీప్రాంతంలో 30 మందితో కూడిన గ్రేహౌండ్స్ బలగాలు ఆదివారం రాత్రి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని రాజోలుగూడకు చెందిన 2012 బ్యాచ్ గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ (34)తో పాటు పలువురు గ్రేహౌండ్స్ కమాండోలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భూమికి రెండు ఫీట్ల ఎత్తులో సెంట్రింగ్ వైర్‌తో విద్యుత్ సరఫరా అయ్యేలా వన్యప్రాణుల కోసం వేటగాళ్లు తీగలను అమర్చి ఉన్నారు. అవి తగిలి ప్రవీణ్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి వెళ్లారు. చేతిపై వైరు లోతుగా దిగింది. దీంతో తోటి కానిస్టేబుల్స్ తమ ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ అధికారులకు ఈ సమాచారాన్ని చేరవేశారు. స్థానిక సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి హుటాహుటిన బయల్దేరారు. అటవీ ప్రాంతం కాగా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో అప్పటికే గ్రేహౌండ్స్ కమాండోలు ప్రవీణ్‌ను చేతులపై ఎత్తుకొని కొద్ది దూరం మోసుకొచ్చారు. అనంతరం 108 అంబులెన్స్ చేరగా అందులో తరలిస్తుండగానే ప్రవీణ్ మృతి చెందారు. మృతడికి భార్య లత, కుమారులు హర్ష, వివాన్ ఉన్నారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గొర్రెలను వెతుకుతుండగా

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన మాదారపు అనిల్‌కు సంబంధించిన గొర్రెలు ఆదివారం రాత్రి మంద నుంచి తప్పిపోయాయి. వాటిని వెతికేందుకు తన మిత్రుడు పిండి రమేష్ (28)తో కలిసి రాత్రి 11గంటల సమయంలో సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ముందుగా నడుస్తున్న రమేష్ అటవీ జంతువులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ ఉచ్చు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వెనక వస్తున్న అనిల్ అప్రమత్తమయ్యాడు. చీకటిగా ఉండటంతో కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే రమేష్ మృతిచెందాడు. అనిల్ ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న రమేష్‌ను చూసి బోరున విలపించారు. రమేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది. భర్త అకాల మరణంతో ఆయన భార్య అఖిల గుండెలవిసేలా రోదించింది. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రమేష్ మృతదేహం

వైభవంగా మార్కండేయ జయంతి


మార్కండేయ జయంతి వేడుకల్లో పాల్గొన్న పద్మశాలి సంఘాల బాధ్యులు


స్టేషన్ ఘన్‌పూర్‌లో మార్కండేయ జయంతిలో పూజలు చేస్తున్న భక్తులు


జఫర్‌గఢ్‌లో మార్కండేయ జయంతి వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12: పద్మశాలీల ఇలవేల్పు అయినటువంటి భక్త మార్కండేయ జయంతి వేడుకలను సోమవారం పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మార్కండేయ చిత్రపటంను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో సభ్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణమూర్తి, సాంబారి సత్యనారాయణ, వేళ్ల సురేందర్, కూరపాటి శ్రీనివాస్, గడ్డం విష్ణు, శంకర్, దిడ్డి సత్యనారాయణ, కుసుమ సాంబశివ, చందు, నరేష్, లక్ష్మీనారాయణ, రామస్వామి పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : బచ్చన్నపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయుడి జయంతి వేడుకలు ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారుల్లో దేవుడిపట్ల విశ్వాసాన్ని, కోరికలను నెరవేర్చుకోవటంలో చూపాల్సిన పట్టుదలను పెంచేందుకు మార్కండేయుడి కథను పెద్దలు చెబుతుంటారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, భక్తులు భజనలు చేస్తూ గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : మార్కండేయ స్వామి జయంతి వేడుకలు సోమవారం డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్‌లో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మార్కండేయ స్వామి చిత్ర పటానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గడ్డం కృష్ణమూర్తి, ఎస్.సత్య నారాయణ, వి.సురేందర్, కె.శ్రీనివాస్, జి.విష్ణు శంకర్, డి.సత్యనారాయణ, కె.సాంబశివ, వి.చందు, పూజారి కలకోట నరేష్, పి.లక్ష్మీనారాయణ, జి.రామస్వా మి, ఎం.వెంకటేశ్వర్లు, బి.రవి, జి.రమేశ్, కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్ : మార్కండేయ జయంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. స్థానిక పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా పద్మశాలి భవన్‌లో శ్రీభక్త మార్కండేయ చిత్ర పటానికి సంఘం ప్రతినిధులు, పద్మశాలి కులస్తులు పూల మాలలు వేసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మామిడాల సోమనారాయణ, టౌన్ అధ్యక్షుడు బైరి వెంకటేశ్వర్లు, జిల్లా, మండల ప్రతినిధులు కన్న సోమశేఖర్, ఈరబత్తిని అంజయ్య, బైరి ఉపేందర్, కృష్ణ, అంజయ్య, సోమయ్య, సత్యనారాయణ, గుర్రపు సతీష్, మంగలంపెల్లి అంజయ్య, కోమటి ప్రభాకర్, దామోదర్, రమేశ్, పాము నర్సింహరాములు, గాజుల శ్రీనివాస్, యూత్ జిల్లా, మండల కార్యదర్శులు చిలుకమారి అశోక్, ఈరబత్తిని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బచ్చన్నపేట మార్కండేయ ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న టీజీవీపీ నాయకులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని టీజీ వీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన డీఐఈవో బి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల పేద విద్యార్థులు పై చదువులకు విద్యాసంస్థల నుంచి సర్టిఫికెట్లు తీసుకోలేక పోతు న్నారన్నారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల సురేశ్, జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, కార్తీక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి శుభాకాంక్షల వెల్లువ


సీఐ రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శిరీష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12: నూతనంగా విధుల్లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ సీఐ ముస్కు రాజు ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, చింత ఎల్లయ్య కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, సుధాకర్, పొన్న రాజేష్‌లు సీఐని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

సఖీ జిల్లా కో ఆర్డినేటర్ ఒద్దిరాల జ్యోతి



మల్యాపూర్‌లో సఖి సేవలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్ ఒద్దిరాల జ్యోతి

చిలుపూర్, ఫిబ్రవరి 12 : సమాజంలో మహిళల పాత్ర కీలకమని సఖీ జిల్లా కో ఆర్డినేటర్ ఒద్దిరాల జ్యోతి అన్నారు. మండలంలోని మల్యాపూర్ లో సఖీ సేవలతో పాటు, టోల్ ఫ్రీ నంబర్ 181 (మహిళల హెల్ప్‌లైన్)పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ జ్యోతి మాట్లాడుతూ, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక, మానసిక, రాజకీయ, గృహహింస, పిల్లల అక్రమ రవాణా, యాసిడ్ దాడులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా ఉక్కుపాదం మోపుతున్నాయని, అందులో భాగంగానే ప్రతీ జిల్లాలో సఖి కేంద్రాలను ఏర్పాటు చేశాయన్నారు. మహిళల అత్యవసర సేవల నిమిత్తం షీటీంలతో పాటు, 181 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి, ఐకేపీ సీసీ రమాదేవి, ఎస్ఎస్‌జీ మహిళలు పోలేపల్లి మాధవి, తోకల కరుణ, షమాదేవి, పోలేపల్లి సంధ్య, మాదంశెట్టి కనకతార, ఎలిశాల రజిత, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12 : కరాటే పోటీలలో జనగామ జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. షొటోకాన్ జపాన్ కరాటే ఇండియా మాస్టర్ రచ్చ శ్రీను ఆధ్వర్యంలో ఈ నెల 11న నర్సంపేట పద్మశాలి గార్డెన్‌లో నిర్వహించిన పోటీలలో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు న్యూ స్టార్ చైనీస్ కుంగ్‌ఫూ రాష్ట్ర కార్యదర్శి మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను న్యూ స్టార్ చైనీస్ కుంగ్‌ఫూ వ్యవస్థాపకుడు, గ్రాండ్ మాస్టర్ ఎం.డి.సలీమ్ పాషా అభినందించగా, సినీ నటుడు సుమన్ సలీమ్ పాషా ను అభినందిస్తూ మెమెంటో అందించారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

రఘునాథపల్లి, ఫిబ్రవరి 12 : కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 16న వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం మహేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కడారి ఐలయ్య, శాగ సాంబరాజు, దేగల బాబు, అల్లిబిల్లి సుధాకర్, ఎడ్ల భాస్కర్, దేగల యాదగిరి, గడపక నర్సయ్య, దావిద్, పరుశరాములు, కృష్ణ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా మేడారం జాతర జరపాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12: మేడారం జాతరను పర్యావరణ హితంగా జరపాలని కోరుతూ సోమవారం మండలంలోని కొడవటూరు ఉన్నత పాఠశాలలో వినూత్నంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల నమూనాలను ఏర్పాటు చేసి జాతర జరుపుకునే విధానాన్ని వివరించారు. గద్దెల వద్ద బంగారం, దుస్తులు సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకు ముందు మంత్రులు, కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు ఇలా పలువురు వివిధ పాత్రల్లో ఒదిగిపోయి జాతర ఎలా జరపాలనే విషయాన్ని ఆవిష్కరించారు. మంత్రులు సీతక్కగా కావేరి, కొం సురేఖగా సౌమ్య కలెక్టర్‌గా మల్లిక, జడ్పీ చైర్మన్‌గా భవానీ, సీఈవోగా వైష్ణవి, ప్రజాప్రతినిధులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలికట్టె యాదగిరి, ఝాన్సీలక్ష్మీబాయి, సంతోష్‌కుమార్, జయశ్రీ, నరేష్, అపరంజి, ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక


చందు


నాజియా

లింగాలఘణపురం, ఫిబ్రవరి 12: మండలంలోని నవాబుపేట జడ్పీహైస్కూల్‌కు చెందిన జి చందు, ఎండి నాజియా ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సత్యనారాయణ, పీఈటీ అశోక్‌కుమార్ తెలిపారు. జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో జరిగిన అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో చందు షాట్‌పుట్‌లో, నాజియా జావెలిన్‌లో ప్రతిభను చాటారు. దీంతో ఈనెల 15 నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం సత్యనారాయణ, పీఈటీ అశోక్‌కుమార్‌తో పాటుగా ఉపాధ్యాయులు అభినందించారు.

స్థలాన్ని కేటాయించి పట్టాలు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 : మండలంలోని నమిలిగొండ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 175లో గ్రామానికి చెందిన 140మంది లబ్ధిదారులను గ్రామసభ ద్వారా అధికారులు ఎంపిక చేశారని ఇప్పటికైన లబ్ధిదారులకు స్థలాన్ని కేటాయించి పట్టాలు ఇవ్వాలని సోమవారం లబ్దిదారులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గాదె శ్రీధర్, గాదె రాంచందర్, జోగు శ్రీను, జింక ప్రశాంత్, ఉపేంద్ర, రాజమ్మ, లద్దునూరి ఎల్లమ్మ, ఆశీర్వాదం పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12 : లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రామా రాజకీయాలకు తెరతీశాడని కాంగ్రెస్ పార్టీ నేతలు నిడిగొండ శ్రీనివాస్, జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, ఈదులకంటి వెంకట్‌రెడ్డిలు మండిపడ్డారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బండనాగారం గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కృష్ణాబోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతను బీఆర్ఎస్ సర్కార్ అభ్యంతరం వ్యక్తం చేసుంటే పరిస్థితి ఇంతదాక వచ్చేది కాదన్నారు. ఇజ్జగిరి రాములు, ఆరెళ్ల భాస్కర్, ఇప్ప శ్రీధర్‌రెడ్డి, చల్లా సురేందర్‌రెడ్డి, మానేపల్లి బాబూరావు, జంగిటి స్వామి, రాజేశ్‌ఖన్నా, మండల కమిటీ సమన్వయ కర్తలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

లెదర్‌పార్కు ఏర్పాటుపై ప్రభుత్వ ప్రకటన హర్షనీయం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12: రాష్ట్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క స్టేషన్‌ఘన్‌పూర్ లెదర్‌పార్కు అంశంపై మాట్లాడడంతో అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికులకు ఊరట కలుగనుందని చర్మకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాజారపు ప్రభుదేవ్ అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో లెదర్‌పార్కు అంశం 22 ఏళ్ల తరువాత అధికార ప్రభుత్వం దృష్టిసారించడంపై చర్మకారుల సం ఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటా నికి చర్మకారులతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాదె కుమార్, అనంతపురం చంద్రమౌళి, చేపూరి కుమార్, ప్రవీణ్, ప్రేమానందం, గుర్రం శ్రీను, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని అప్పగించిన పోలీసులు

తరిగొప్పుల, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని జేఎస్ స్కూల్‌కు చెందిన ఓ బాలుడు సోమవారం తప్పిపోగా పోలీసులు నిమిషాల వ్యవధిలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేశ్యతండాలకు చెందిన లావుడ్య లలిత రమేష్‌ల కుమారుడు చరణ్(13) స్థానిక ఎస్టీ బాలుర వసతి గృహంలో ఉంటూ జేఎల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడన్నారు. ఈ క్రమంలో బాలుడు సోమవారం ఉదయం వసతి గృహం నుంచి పాఠశాలకు బయదేరి తరగతులకు హాజరుకాకుండా ఎటో వెళ్లిపోయాడు. విషయం గమనించిన పాఠశాల యాజమాన్యం వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో బాలుడిని నిమిషాల వ్యవధిలో కనిపెట్టి విచారించారు. హోంవర్క్ చేయలేదనే భయంతో పాఠశాలకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నానని బాలుడు తెలిపాడు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించగా పాఠశాల యాజమాన్యం, బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పోలీస్ సిబ్బంది కనుకరాజు, గుగులోతు బాలజి పాల్గొన్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా వాసికి ఘన స్వాగతం


శివశంకర్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12 : రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీ ఎర్రకోటలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న జిల్లా వాసికి ఘన స్వాగతం లభించింది. జనగామ జిల్లా కేంద్రం లోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికామ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్ కడారి శివశంకర్ జనవరి 26న రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా కల్చరల్ ఆక్టివిటీ పాల్గొన్నాడు. శివశంకర్ స్వగ్రామం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల కాగా సోమవారం కళాశాల కు వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులతో కలిసి ఎల్‌ఐసీ చౌరస్తా నుంచి కళాశాల వరకు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శివశంకర్‌తో పాటు ఆయన తల్లిదండ్రులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ తమ గ్రూపు పెర్ఫార్మ్ చేసిన పాటకు మొదటి బహుమతి లభించిందని, ఈ గౌరవం పొందడం తనకు చాలా గర్వంగా ఉందన్నారు. అందుకు కారణమైన ప్రిన్సిపాల్ నర్సయ్య, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాస్ గౌడ్, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అండర్ ఆఫీసర్ హరిప్రసాద్, జూనియర్ అండర్ ఆఫీసర్ ప్రత్యూష సహాయ సహకారాలు అందించినట్లు పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 12: ఈ నెల 16న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి గంగరబోయిన మల్లేశ్‌రాజు, ఏఐటీయూసీ, టీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్ధన్, పిలుపునిచ్చారు. సోమవారం వారు వేర్వేరుగా జనగామలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో శ్రీదేవికి ఆశా వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు.

వైద్యం అందక చనిపోతున్న పశువులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12:సకాలంలో వైద్యం అందకపోవడంతో తమ గ్రామంలో పశువులు మృత్యువాత పడుతున్నాయని మండలంలోని గంగాపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన బందారపు మహేందర్, పిట్టల శ్రీహరి అనే రైతుల ఆవులు అస్వస్థతకు గురై చనిపోయియన్నారు. బచ్చన్నపేట పశువైద్యశాలకు ఇన్‌చార్జి వైద్యుడు ఉండటంతో సేవలు అందటం లేదన్నారు. అధికారులు పశువులకు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బందారపు వినయ్‌కుమార్ కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కీంలో చేర్చాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 12: జిల్లాలో ప్రముఖ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ స్కీంలో చేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ స్కీం అమలుచేస్తే ప్రతిభ గల పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుతుందన్నారు. కానీ ఈ పథకాన్ని జిల్లాలోని కార్పొరేట్ స్కూళ్లు అమలు చేయడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పది సీట్ల వరకు కేటాయించేలా చూడాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గద్దల కిశోర్, పైసా రాజశేఖర్, సందేన రవీందర్, గువ్వల రవి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 12 : మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన బాలగాని భిక్షపతి సోమవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానికులు చికిత్స కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మల్కపేట విద్యార్థి

నర్మెట, ఫిబ్రవరి 12 : మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన విద్యార్థి కన్నారపు సాయిరాం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ తేజావత్ మోహన్ సోమవారం తెలిపారు. ఈనెల 11న జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఎల్లమ్మగడ్డ తండాను జీపీగా ఏర్పాటు చేయాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 12 : మండలంలోని అయ్యంగారిపల్లి శివారులోని ఎల్లమ్మగడ్డ తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గిరిజనులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బానోతు రమేష్, నరేష్, రాజేందర్, వెంకన్నలు మాట్లాడుతూ 2018లో అప్పటి ప్రభుత్వం ఎల్లమ్మగడ్డ తండాను గ్రామ పంచాయతీగా చేస్తానని మాట తప్పిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లమ్మగడ్డతండా, బాబూనగర్, దుర్యా, వెంకటి తండాలను కలుపుతూ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. అది వీలుకాకపోతే బమ్మెరలోనే (పాత జీపీ) కలపాలని కోరారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌రెడ్డి



పాలకుర్తి, ఫిబ్రవరి 12 : పాలకుర్తి సీఐగా జి. మహేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన సీఐ విశ్వేశ్వర్ ధర్మసా గర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా మందమర్రి సీఐగా పనిచేసిన మహేందర్‌రెడ్డి పాలకుర్తికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

పాలకుర్తి ఎస్సైగా సాయి ప్రసన్నకుమార్




పాలకుర్తి ఎస్సైగా సాయి ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తాళ్ల శ్రీకాంత్ వరంగల్ వీఆర్‌కు అటాచ్ చేయగా, ఆయన స్థానంలో వరంగల్ ఇంతేజార్‌గంజ్ ఎస్సైగా పనిచేసిన సాయి ప్రసన్నకుమార్ వదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

దేవరుప్పుల ఎస్సైగా చెన్నకేశవులు బాధ్యతలు స్వీకరణ



దేవరుప్పుల, ఫిబ్రవరి 12: దేవరుప్పుల మండల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా చెన్నకేశవులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై కె. శ్రవణ్‌కుమార్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన చెన్నకేశవులు దేవరుప్పులకు బదిలీపై వచ్చారు.

భూ వివాదంలో వ్యక్తిపై గొడ్డలితో దాడి


తీవ్రంగా గాయపడ్డ భిక్షపతి

పాలకుర్తి, ఫిబ్రవరి 12 : ఓ భూమి వివాదంలో గొడ్డలితో వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని లక్ష్మీనారాయణపురంలో సోమవారం జరిగింది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపి న వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గుత్తి భిక్షపతికి అదే గ్రామానికి చెందిన మజ్జిగ యాదగిరిల మధ్య గత కొంత కాలంగా భూమి తగాదాలు కొనసాగుతున్నాయి. భిక్షపతిపై కక్ష పెంచుకున్న యాదగిరి, అతని కుమారుడు వీరస్వామిలు ఎలాగైన అతడి అడ్డు తొలగించుకోవాలని భావించాడు. సోమవారం సాయంత్రం తన చెలక వద్దకు వెళ్లగా భిక్షపతి, వీరస్వామిలు ఇద్దరు గొడవపడ్డారు. ఈ గొడవల్లో ముందుగా వీరస్వామి భిక్షపతిని బండ రాయితో గాయపరిచాడు. జరిగిన గొడవను తన తండ్రి యాదగిరికి కుమారుడు వీరస్వామి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. తన చెలక వద్దనుంచి నడుచుకుంటు ఇంటికి వెళుతున్న భిక్షపతిపై ఎదురుగా వస్తున్న యాదగిరి గొడ్డలితో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచాడు. దీంతో భిక్షపతి రక్తస్రావంతో కుప్పకూలాడు. తీవ్ర రక్త స్రావంతో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు భిక్షపతిని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడి పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. భిక్షపతి బంధువు జోగు సాయి ఫిర్యాదు మేరకు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను జరిగిన సంఘటనపై వివరాలు అడిగి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్పంచ్‌లకు ఘన సన్మానం

కొడకండ్ల, ఫిబ్రవరి 12 : మండలంలోని అన్నిగ్రామాల సర్పంచ్‌లకు పదవీకాలం పూర్తయిన సందర్భంగా మాజీ సర్పంచ్‌లను ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ డి.జ్యోతి, జడ్పీటీసీ కె.సత్తెమ్మలు మెమొంటోలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, ఏఎంసీ చైర్మన్ పేరం రాము, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజీ, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీవో నాగేశ్వ సూరి, డా.హరికృష్ణ, ఏపీవో కుమార స్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12: మండలంలోని రెండు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో లక్ష్మాపూర్‌లో ఏకగ్రీవం కాగా, అధ్యక్షకార్యదర్శులుగా చిలుక ప్రవీణ్, ఇమ్మడి కుమార్, ఉపాధ్యక్షులుగా శివరాత్రి సిద్దులు, నూకల కృష్ణారెడ్డిలను ఎన్నికయ్యారు. బండనాగారంలో ఆరుగురు పోటీపడగా, నలుగురు విరమించుకుని చివరకు ఇద్దరు ఆశావాహుల మధ్య ఓటింగ్ నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఇప్ప శ్రీధర్‌రెడ్డి, మానేపల్లి బాబూరావు, ఉపాధ్యక్షులుగా మానేపల్లి భూమయ్య, ఇజ్జగిరి పర్శరాములు, యూత్ అధ్యక్షులుగా గండి సురేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కమిటీల ఎన్నికల సమావేశాలకు హాజరైన సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడారు. నేతలు ఆల్వాల ఎల్లయ్య, నిడిగొండ శ్రీనివాస్, ఈదులకంటి వెంకట్‌రెడ్డి, జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మసూద్, బండకింది హరిబాబుగౌడ్, వేణువందన, నూకల బాల్‌రెడ్డి, రాజేశ్‌ఖన్నా పాల్గొన్నారు.